విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల 81 వేల ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆదాయానికి గండి కొడితే చూస్తూ ఊరుకోబోమని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1 నుండి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆటో డ్రైవర్ల కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం రైల్వే స్టేషన్ ఇండియా జంక్షన్ దగ్గర ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ జీఓ నెంబర్లు 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధికి ప్రమాదకరంగా ఉన్న ఓలా, రాపిడ్, ఊబర్ తదితర ప్రైవేట్ బడా కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారిగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావి కృష్ణ, వై.వెంకట్, శేఖర్, కే.నూకరాజు, బి.జగన్నాథం, పి.శంకర్రావు, వై.నాగరాజు, పి.రమేష్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే

వైసీపీకి పతనం తప్పదు

కార్మిక ప్రజాసంఘాలు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి, మునిసిపల్, సర్వ శిక్ష అభియాన్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం నిర్బంధం ఆపి వీరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలో కార్మిక ప్రజాసంఘాలు భారీ సంఘీభావ ప్రదర్శన నిర్వహించాయి. సరస్వతి పార్క్ నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కే.మల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడి, మునిసిపల్, సర్వ శిక్ష అభియాన్ కార్మికులు దీర్ఘకా లంగా తమ సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారని, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చారని, వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారని అయినా ఫలితం లేదన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కార్మికులపై నిర్బంధం నిలిపివేయాలని, సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను అరెస్టులు చేయించి స్టేషన్లో నిర్బంధించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు బి.పుష్పలత, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి రోహిణి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పడాల రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.వెంకటరెడ్డి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వామనుమూర్తి, ట్రాన్స్ పోర్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ముఠా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె.రామకృష్ణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.అనసూయ, తోపుడుబండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.మూర్తి, హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.హరి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని రాజవరం శివారు గజపతినగరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కాకాడ కొండయ్యకు చెందిన పూరి గుడిసె దగ్ధమై సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. కొండయ్య కుమార్తె చిన్నారికి ఇటీవలే వివాహ జరిగింది. కుమార్తెకు సుమారు లక్షన్నర విలువైన గృహోపకరణాలను కొనుగోలు చేసి ఇంట్లో ఉంచారు. అర్ధరాత్రి అనుకోకుండా జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లో వస్తువుల తోపాటు, కొనుగోలు చేసిన గృహోపకరణాలు కూడా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కొండయ్య కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మండల వైసీపీ ఉపాధ్యక్షులుగా బొట్టా రాజారావు

విశాలాంధ్ర - కశింకోట: మండల వైసీపీ ఉపాధ్యక్షులుగా జమాదులపాలెం గ్రామానికి చెందిన బొట్టా రాజారావును నియమించినట్లు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నంటు ఉండి పనిచేశానని, ఆ ఫలితమే నన్ను గుర్తించి మండల ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజారావుకు ఈ పదవి రావడం పట్ల మండలంలో ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

వంశీకృష్ణను కలిసిన సుంకర హరిబాబు

విశాలాంధ్ర - సాగర్ నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించాలని కోరుకుంటూ ఎనిమిదో వార్డు వైయస్సార్ మాజీ అధ్యక్షుడు సుంకర హరిబాబు జనసేన పార్టీ నాయకుడు వంశీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. జనసేన పార్టీ యువతరానికి ఎంతో మేలు చేస్తుందని సుంకర హరిబాబు అన్నారు. అనంతరం వంశీకృష్ణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం : 2024 నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా మండల ప్రజలకు జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో జెడ్పీటీసీ నర్మాల కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నామని తెలిపారు.

వారం రోజుల పాటు వనజంగి పర్యాటక కేంద్రం మూసివేత

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వనజంగి కొండ సందర్శనను 2024 జనవరి రెండవ తేదీ నుండి తొమ్మిదవ తేదీ వరకు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వనజంగి పర్యాటక కేంద్రం కాలుష్యంతో నిండినందున, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, రాళ్ళు, రప్పలు తొలగింపు, పొదల తొలగింపు, రహదారి మరమ్మత్తులు తదితర కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం వారం రోజులపాటు మూసివేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో పర్యాటకులు గమనించి ఆయా రోజులలో వనజంగి సందర్శనకు రావద్దని కలెక్టర్ సూచించారు.

2, 3న చాపరాయిలో పర్యాటకులకు ప్రవేశం నిలుపుదల

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టేందుకు గాను ఈనెల 2, 3న పర్యాటకులకు ప్రవేశం నిలుపుదల చేస్తున్నట్లు ఐటీడీఏ టూరిజం కోఆర్డినేటర్, చాపరాయి జలపాతం సూపర్వైజర్ అప్పారావు తెలిపారు. ఆదివారం అయిన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జలపాతంలో పర్యాటకులకు ఆకర్షణీయంగా సుందరీకరణ పనులు చేపట్టి త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో జలపాతం మొత్తం క్లీన్ అండ్ గ్రీన్ చేయడానికి రెండు రోజులు పడుతుందన్నారు. దీంతో రెండు రోజులుగా పర్యాటకులకు ప్రవేశ అనుమతి ఇవ్వడం జరగదని, దీన్ని పర్యాటకులు గమనించుకోవాలని ఆయన కోరారు.

సీపీఐ పార్టీకి సహకరించండి

విశాలాంధ్ర - గాజువాక : భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడు తుందని, ప్రజలంతా సీపీఐ పార్టీకి సహకరించాలని గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ చిన గంట్యాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ పార్టీ ప్రజల సమస్యలతో పాటు హక్కుల సాధనకు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శాఖా కార్యదర్శి అప్పారి విష్ణు మూర్తి, నాయకులు జి.ఆనంద్, పెదపూడి దుర్గారావు, మహిళా సమాఖ్య నాయకురాలు పిల్లా సూర్య పద్మ పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర - చింతపల్లి: బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పథకం ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు భరోసా అని టీడీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమ నిర్వహణకు ఆదివారం చింతపల్లి వచ్చిన ఆయన ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావులతో కలిసి గ్రామంలోని పలు వీధులలో బూత్ కన్వీనర్లతో కలిసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమ వివరాలను తెలుపుతూ ఆయా కుటుంబాల పేరిట ఆ పథకాలకు సంబంధించిన కార్డులలో ఆ కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ బూత్ కన్వీనర్లు, బేతా నాగు, జర్రా కోటేశ్వరరావు, మర్రి మంగ్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్జిత సేవలు



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి స్వర్ణ పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చన, నిత్యకల్యాణం, గరుడ సేవలు వీనుల విందుగా జరిగాయి. ఆలయ ఏ.ఈ.ఓ ఏడిద వీర వెంకట సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు శ్రీనివాసు ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ వేకువ జామున సింహాద్రి నాధుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 2024 జనవరి 14వ తేదీన కొండక్రింద వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గోదాకళ్యాణం, జనవరి 6వ తేదీన స్వాతి నక్షత్ర హోమం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు.

గీతం ఎన్.ఎస్.ఎస్. వలంటీర్ల ట్రెక్కింగ్

విశాలాంధ్ర - మధురవాడ: పర్యాటక ప్రాంతాలను ముఖ్యంగా అభయారణ్యాలను పరిరక్షించుకోవాలనే నినాదంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) వలంటీర్లు ఆదివారం కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో 50 మంది ఎన్.ఎస్.ఎస్. వలంటీర్లు ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. అభయారణ్యాలలో జీవజాతులను కాలుష్యం నుంచి కాపాడు కోవాలని, పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయరాదని ఈ సందర్భంగా విద్యార్థులు బ్యానర్లను ప్రదర్శించారు. అటవీశాఖ అధికారి శివప్రసాద్ ఇకో టూరిజం ప్రాధాన్యతను, కంబాలకొండ అభయారణ్యం విశేషాలను వలంటీర్లకు వివరించారు.

3న పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - కే.కోటపాడు: తాడేపల్లిలో ఈనెల 3వ తేదీన ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రాష్ట్రస్థాయి సదస్సుకు రాజకీయా లకు అతీతంగా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు హాజరు కావాలని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం కే.కోటపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికై మూడు సంవత్సరాలు కావస్తున్నా నిధులు, అధికారాలు లేక ప్రజలకు కనీస అవసరాలు తీర్చలేకపోతున్నా మన్నారు. గ్రామ పంచాయితీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం పంపిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు 8660 కోట్ల రూపాయలు దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకున్నారని అన్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం మంజూరు చేసిన 36 వేల కోట్ల రూపాయలు దారి మళ్లించి సొంత భవనాలకు వాడుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రెండో దశ ఉద్యమం సందర్భంగా 16 డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు చేస్తున్న రాష్ట్రస్థాయి సదస్సుకు అత్యధికంగా ప్రజాప్రతి నిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

కబడ్డీ క్రీడతో అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర - పరవాడ: అంగన్వాడీలు చెప్పిన సమ్మె ఆదివారం నాటికి 21వ రోజుకి చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా అంగన్వాడీలు వాడ చీపురుపల్లి తదితర చోట్ల అంబేద్కర్ విగ్రహం వద్ద కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వేతనాలు పెంచాలని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెర వేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సహనాన్ని పరీక్షిస్తుందని, మహిళల ఆగ్రహానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గురి కావొద్దని హెచ్చరించారు. తమ న్యాయ పరమైన సమస్యలు పరిష్కారం చేయకపోగా బెదిరింపులకు పాల్పడడం సరైంది కాదన్నారు. తాటాకు చప్పులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు కె.లక్ష్మి, ఎస్.విజయ, జానకి, కె.రత్నం, వరలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ క్లస్టర్ కమిటీల నియామకం

విశాలాంధ్ర - పద్మనాభం: వైసీపీ మండల, క్లస్టర్ పార్టీ కమిటీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. వీరిలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షునిగా బంక సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కోరాడ ముసలినాయుడు, పడాల రామును నియ మించారు. భీమిలి మండల పార్టీ అధ్యక్షునిగా గాడు శ్రీను, ఉపాధ్యక్షులుగా బుద్ధిరాజు సత్యనారా యణరాజు, చెల్లూరి నగేష్ బాబు, పద్మనాభం మండల అధ్యక్షునిగా కోరాడ లక్ష్మణరావు, ఉపాధ్య క్షులుగా అముజూరి అప్పారావు, బానురోతు అప్పారావును నియమించారు. జీవీఎంసీ 1వ వార్డు అధ్యక్షునిగా జగుపల్లి ప్రసాద్, ఉపాధ్య క్షులుగా తమ్మిన కూర్మారావు, కుంచా శివరా మకృష్ణ, 2వ వార్డు అధ్యక్షునిగా చిల్ల భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షులుగా అక్కరమాని లోవరాజు, సరగడ శివాంజనేయ రెడ్డి, 3వ వార్డు అధ్యక్షునిగా అల్లిపిల్లి నరసింగరావు, ఉపాధ్యక్షులుగా బాకి రమణారెడ్డి, గుండాసు మధునాయుడు, 4వ వార్డు అధ్యక్షునిగా పాల రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా జగన్నాథ అప్పారావు, నాగోతి అచ్చారావును నియమించారు. మధురవాడ జోన్లోని క్లస్టర్ - 4 అధ్యక్షునిగా బొట్ట అప్పల రాజు, ఉపాధ్యక్షులుగా వి.వి. నరసింగరావును నియమించారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నవరత్నాలు - నవమోసాలు పేరుతో ప్రజలను సీఎం జగన్ మోసం చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని 75వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. 75వ వార్డు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, ఇతర నాయకులు ములకలపల్లి పెంటయ్య, అండిబోయిన రాము నాయుడు, మొల్లి అప్పారావు, పులి శ్రీరామ రెడ్డి, కాకినాడ అప్పల రాజు, బస అప్పల రెడ్డి, నరసింహరాజు, కణితి సన్యాసమ్మ, దోమ్మేటి కనక రాజు, దోమ్మేటి నాగరాజు, ముద్దుర్థి శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువసేన యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో సొంత్యాం గ్రామపంచాయతీ గుమ్మడివారిపాలెం గ్రామంలో యువసేన యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఎస్‌పీఎల్ క్రికెట్ క్రీడలు నిర్వహించారు. కోరాడ వెంకటరమణా రావు, రౌతు శ్రీను, సీతారాం సుమారుగా తమ సొంత నిధులతో క్రీడాకారులకు 60కు పైగా టీ షర్ట్‌లు అందించారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంక రాంబాబు, కోరాడ రమణారావు, కోరాడ పాపు నాయుడు, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు, గ్రీవెన్స్ సెక్రటరీ రౌతు శ్రీను, సీతారాం, రవికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలను మహా విశాఖ పట్నం నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. నూతన సంవత్సరంలో నగర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని అలాగే విశాఖనగరం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని ఆమె తెలిపారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస అధ్యయన ఉత్సవములలో భాగంగా ఆదివారం ఉదయం రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామ తిరువీధి సేవ ఘనంగా జరిగింది. వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకీలను అధిష్టింపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం (స్పందన) రద్దు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనవరి ఒకటో తేదీన ఉద్యోగుల ఐచ్ఛిక సెలవు నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున తెలిపారు. ఐచ్ఛిక సెలవు కారణంగా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండరని, కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

సృజనాత్మకతకు చిత్రకళ దోహదం

విశాలాంధ్ర - మల్కాపురం: సృజనాత్మకత పెంపొందిం చడానికి చిత్రకళ దోహదం చేస్తుందని జి.వి.యం.సి వైద్యాధికారి డా. పి.హేమలత అన్నారు. ఆదివారం పాత గాజువాకలో చిత్రకళా పరిషత్ మ్యాగజైన్‌ను ఆమె ఆవిష్క రించారు. ఔత్సాహికులకు ఈ పత్రిక ఎంతో ఉపయుక్తం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రలేఖనం పత్రిక సంపాదకులు డి.ఎస్. మనోహర్, సుంకర చలపతిరావు, డా. గౌతమి పాల్గొన్నారు.

బర్సింగిమెట్టలో పీఎం జన్‌మాన్ సర్వే

విశాలాంధ్ర - జి.మాడుగుల: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మాన్ ద్వారా కొత్త ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తుందని హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు తెలిపారు. జి.మాడుగుల మండలంలో గడుతూరు పంచాయతీ బర్సింగిమెట్ట గ్రామంలో పీఎం జన్‌మాన్ సర్వేను ఆదివారం నిర్వహించారు. ప్రతీ పీవీటీజీ కుటుంబ ఇంటి నిర్మాణానికి రూ.2.3 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. మండలంలో 25 పీవీటీజీ గ్రామాల్లో సర్వే జరుగుతుందని అన్నారు. పీవీటీజీ కుటుంబా లకు ఆధార్, కుల ధ్రువీకరణ, జనధన్ ఖాతాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ, డీఓ కల్యాణం పాల్గొన్నారు.

భాస్కర్ విద్యానికేతన్ స్కూల్ క్యాలెండర్ ఆవిష్కరణ



విశాలాంధ్ర - గాజువాక: చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను స్కూల్ ఆవరణలో తల్లిదండ్రుల సమక్షంలో ఆవిష్కరించారు. 2024 సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ వి.రమాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు సునీత, రాణి, తల్లిదండ్రులు మదీన, వరలక్ష్మి, సంధ్య, గౌసీ బేగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ బాలగణపతి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ఉప్పారాపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ బాల గణపతి శ్రీ మయూరి సుబ్రహ్మణ్య స్వామి ఆలయం నాలుగవ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం నుండి ఆలయంకు భక్తులు వచ్చి సోమవారం దర్శించుకున్నారు. భజన కార్యక్రమం ఏర్పాటు తోపాటు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి శ్రీరామ్, ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మపాల అప్పలరాజు, వైస్ చైర్మన్ టి.రమణ, కార్యదర్శి వెంకట సత్యనారాయణ, దుంగా సురేష్, ట్రెజరర్ టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అస్సాం ముఖ్యమంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

విశాలాంధ్ర - పాయకరావుపేట: సూద్ర జాతులు, దళిత బహుజనులను అవమానంగా మాట్లాడిన అస్సాం సీఎం హిమంత్ బిస్వా శర్మపై కఠినంగా చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్య బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్య వైశ్యులకు సేవలు చేయడానికే సూద్రులను బ్రహ్మ పుట్టించారని, సూద్రులు బానిసలుగా ఉండాలనే సనాతన ధర్మం మార్గంలో బీజేపీ సర్కార్ పనిచేస్తుందని చెబుతూ, కుల విచ్ఛిన్నం, కుల ద్వేషం, దురహంకారంతో రాజ్యాంగం నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడారని తెలిపారు. అస్సాం సీఎంపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాను కృష్ణ స్వరూప్ డిమాండ్ చేసారు. అస్సాం సీఎం చేసిన వ్యాఖ్యలు దళిత బహుజన పార్టీ తీవ్రంగా ఖండిస్తుం దన్నారు. దళిత, బహుజన, సూద్ర జాతులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సీఎం బహిరంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. తక్షణమే సీఎం పదవి నుండి బర్త్ రఫ్ చేయాలని అస్సాం గవర్నర్, భారత రాష్ట్రపతి లను కోరారు. ఈ వ్యాఖ్యలతో దళిత, బహుజన, శూద్రుల పట్ల బీజేపీ పార్టీ నిజ స్వరూపం బయటపడిందని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లోని బీసీ, ఎస్సి, ఎస్టీ నేతలు బుద్ధి తెచ్చుకొని పరివర్తన చెందాలని కృష్ణ స్వరూప్ హితవు పలికారు. భారత దేశ భూమి పుత్ర సామాజిక పరివర్తకులు, మహనీయులు బాబాసాహెబ్ డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతి భా పూలే, గౌతమ్ బుద్ధిని మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ శాఖ అధ్యక్షులు మద్దెల ప్రవీణ్ కుమార్. దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, నాయకులు పెండ్యాల చంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలపాడులో వికసిత్ భారత్

విశాలాంధ్ర - రావికమతం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత భారత్ సంకల్పయాత్ర మండలంలో గుమ్మలపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కౌన్సిలర్ గల్లా రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికై పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రజలు వినియోగించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కొన్ని మాత్రమే ప్రజలకు తెలుస్తున్నాయని కొంతమంది ఎద్దేవా చేశారు. మరికొన్ని పథకాలు గూర్చి తమకు ఏమాత్రం తెలియదని తెలిసేలా ప్రభుత్వం ప్రకటనలు చేయలేదన్నారు. విషయమై రాజేశ్వరరావు కల్పించుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించారు. కానీ దానికి సంబంధించిన అధికారులు రాకపోవడంతో ప్రజలకు పూర్తి వివరాలు రాజేశ్వరరావు తెలియజేయలేకపోయారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులతో సహా వచ్చి పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మరొకమారు పూర్తిస్థాయి అధికారులతో గ్రామానికి వచ్చి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గ్రామంలో ఎంతమంది లబ్ధి పొందారు అన్న విషయమై సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొముర ఎంపీటీసీ బంటు విజయలక్ష్మి శ్రీను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దాలి నాయుడు, సిహెచ్ఓ హేమ సుందర్, వీఆర్వో మురళీకృష్ణ, గ్రామ పెద్దలు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలోనైనా సీఎం జగన్ మారాలి

వైసీపీ ఓటమికి రోజులు దగ్గరపడ్డాయి
బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనవరి ఒకటో తేది నుండి అయినా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిలో మార్పు రావాలని ఏపీ బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు అన్నారు. జగన్ మోహన్ రెడ్డికి అధికారంలో ఉండే రోజులు దగ్గర పడ్డాయని ఆయన చెప్పారు. ఆదివారం విశాఖలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ వంశీకృష్ణకు జగన్ అన్యాయం చేశారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఓటు వేయకూడదని ఆయన సూచించారు. సిగ్గు లేకుండా జగన్ మళ్లీ ఓట్లు అడుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం బాధాకరమని విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలు తరవాత ఏపీలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ తీసేస్తామని ఆయన చెప్పారు. విశాఖలో మురికి పేరుకుపోయిందని చెప్పారు. ఈ అధికారులు ఫోటోలకు చెత్త ఎత్తుతున్న ఫోజులు పెడుతున్నారు తప్ప చెత్త మాత్రం అలాగే ఉందని తెలిపారు. ఈ సీఎంకి పబ్లిసిటీ పిచ్చి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోడి గుడ్డు మీద కూడా సీఎం బొమ్మే ఉందన్నారు. కనీసం ఈ మూడు నెలలైనా అరాచకాలు ఆపాలని ఆయన కోరారు. వాట్సాప్ మెసేజ్ చేస్తే కూడా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు.

కొత్త సంవత్సరం నుంచైనా జగన్ మారుతారని అనుకుంటున్నానని విష్ణుకుమార్ రాజు ఆశా భావం వ్యక్తం చేశారు

విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక 89వ వార్డు చంద్రనగర్ గ్రౌండ్లో కరాస రాక్ స్టార్స్ లిమిట్ లెస్ గ్లాడియేటర్స్ టీములు మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌ను జీవీఎంసి కో ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని క్రీడాకారుల కోరిక మేరకు ఏర్పాటు చేసిన విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం అన్నిరంగాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులందరూ క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొనాలని ఆయన హితవు పలికారు. అనంతరం జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి నాయకులందరితో కలిసి క్రికెట్ మ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, పూటపల్లి గోవిందు, వల్లంకి ప్రేమ్ కుమార్, అంగటి రాజు, సత్యనారాయణ,మండల పార్టీ ప్రెసిడెంట్లు, జెసిఎస్ క్లస్టర్ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు, సచివాలయం కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, జేసీఎస్ సైన్యం, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

మమ్మల్ని మనుషులుగా గుర్తించండి..
నివాస గృహాలకు రేకులు ఇప్పించండి

విశాలాంధ్ర - చింతపల్లి: బ్రతుకు తెరువు కోసం మన్య ప్రాంతాన్ని నమ్ముకుని తరతరాలుగా చింతపల్లి తో పాటు పరిసర గ్రామాలలో స్థిరపడిన మాదిగలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. ఆనాటి పెద్దలు గ్రామానికి చివరగా ఉన్న ప్రదేశం లో కొంత స్థలాన్ని కేటాయించి యస్ సి కాలనీగా నామకరణం చేశారు. నాడు తక్కువ కుటుంబాలుగా ఉన్న వారి సంఖ్య పిల్లల వివాహాలు, వారి కుటుంబాలతో నేడు స్థానిక యస్ సి కాలనీ లో సుమారు 130 యస్ సి కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా నిరుపేదలు కావడంతో సరైన గృహాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారు. తాతలు, తండ్రులు నిరుపేదలు, నిరక్షరాస్యులు కావడంతో పూరి గుడిసె ల్లోనే నివసించి ఏ పూటకు ఆ పూట పొట్ట పోసుకునే కూలి పనులతో కాలం వెళ్ళ దీశారు. ఆ కాలంలో సరైన సంపాదన లేక పొట్ట కూటి కోసం మాత్రమే పరితపించిన మాదిగలను నాటి పాలకుల నుంచి నేటి పాలకుల వరకు కేవలం ఓటు బ్యాంక్ గానే వాడుకుంటున్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియా కావడం వలన గిరిజనేతరులకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలు వర్తించవు అని చెప్పడం తప్ప తాము కూడా మానవులే అని గుర్తించడం లేదని మాదిగలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన రాజ్యాంగం తమకు నివాస గృహాలకు కనీసం రేకులు కూడా ఇవ్వొద్దని చెప్పిందా అని మాదిగలు ప్రశ్నిస్తున్నారు.

ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం అంది స్తున్న అమ్మ ఒడి, విద్యాదీవెన తదితర పథకాల పుణ్య మా అని తమ పిల్లలు కూడా మంచి విద్యను అభ్యసి స్తున్నారని, కానీ సరైన నివాసం లేక వృద్ధులు, చిన్నా రులు, వ్యాధి గ్రస్తులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, దార బాబు, అప్పారావు లు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మాదిగల నివాస గృహాలకు కనీసం రేకులు ఇప్పించవలసిందిగా వారు అభ్యర్థిస్తున్నారు.

మున్సిపల్ కార్మికులు అరెస్టు, విడుదల

విశాలాంధ్ర-మధురవాడ: జీవీఎంసీ మధురవాడ 7వ వార్డు పరిధి నగరంపాలెం రహదారిలో ఆదివారం కంఫర్ట్ బిన్ వాహనాలు పోలీసులతో నిర్బంధించి తీసుకెళ్లి ప్రయత్నం చెయ్యగా కార్మికులు అడ్డుకున్నారు. కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి రాజ్ కుమార్, మరిడమ్మ అస్వస్థతకు గురయ్యారు. మొత్తం 8 మందిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో యూనియన్ నాయకులు ఎస్.రామప్పడు, జి.కిరణ్, కార్యకర్తలు బి.నర్సింగ రావు, బి.త్రినాథ్, చిన్న, వై.ఆనంద్, ఎస్.పోతురాజు, దీనికి ముందు నగరం రోడ్డులో జరిగిన నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు వాండ్రాసి అప్పలరాజు, నాగోతీ సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, వాండ్రాసి రవికుమార్ పాల్గొని సంఘీ భావం తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులు వెలకట్టలేనివని కొనియా డారు. ప్రభుత్వం నిత్యవసరం సరుకుల ధరలు పెంచుకుంటూ పోతుందని సామాన్య ప్రజలు జీవించిన కష్టంగా మారిందని అన్నారు. ఈ క్రమంలో కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి కార్మికుల సమ్మెను విరమింప చేయాలని కోరారు.

జనవరి 7న బీసీ సామాజిక చైతన్య సభ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనవరి 7వ తేదీన బీసీ సామాజిక చైతన్య సభ నిర్వహిస్తున్నట్టు బిజెపి జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో ఆయన బీసీ సామాజిక చైతన్య సభ ప్రకటన చేశారు. ఈ నెల 7న ఏఎస్ రాజా కళాశాల గ్రౌండ్లో నిర్వహించే ఈ సభ ద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు తెలియజేస్తాం అన్నారు. ఈ రాష్ట్రంలో వైసిపి పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సమాజం వంచనకు మోసానికి గురైందని మేనిఫెస్టోలో ఎన్నికల ముందు పాదయాత్రలో బీసీల కోసం ఎన్నో హామీలు ఇచ్చి ఆ హామీలు తుంగలో తొక్కిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. జీరో బిసి బడ్జెట్‌తో పాలన చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం. 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్క కార్పొరేషన్‌కి కూడా నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లకు మెంబర్లకు విధులు కల్పించకుండా బీసీ సమాజాన్ని అవమానపరిచారు. బీసీ సబ్సిడీ రుణాలు నిలిపివేశారు. బీసీ పారిశ్రామిక వ్యాప్తులకు మూలధన రుణాలు సబ్సిడీ వడ్డీ రుణాలు ఇవ్వలేదు. బీసీ విద్యార్థుల విదేశీ విద్య రుణాలు ఇవ్వకుండా మోసం చేశారు. ఈ రోజున బీసీ సంక్షేమానికి బీసీల అభివృద్ధికి పనిచేయవలసినటువంటి బీసీ కార్పొరేషన్ ని నిర్వీర్యం చేశారన్నారు. అలాగే బీసీ విద్యార్థులకి తీరని ద్రోహం చేస్తూ శిక్షణ నైపుణ్య తరగతులు గాని, బీసీ స్టడీ సెంటర్లను గాని మూసి వేసే పరిస్థితి తీసుకొచ్చారు. సంక్షేమ హాస్టల్స్ లో సరైన సదుపాయాలు లేవు. ఏ రోజున బీసీల కోసం బీసీల పిల్లల భవిష్యత్తు కోసం ఒక్క కార్యాచరణ కూడా చేయకుండా బీసీలను ఉద్ధరించామని జగన్మోహన్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, మాజీ శాసనమండలి సభ్యులు పివీఎన్ మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి విశ్వనాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లి శ్రీనివాస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కంటుబుక్త శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వల్లిరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ మురళి ఇంకా ఓబిసి మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - యస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చిన్న గుమ్ములూరు గ్రామ సమీపంలో ఉన్న నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలని రైల్వే స్టేషన్ మాస్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న రైల్వే స్టేషన్ కు రిజర్వేషన్ కౌంటర్ ను రైల్వే శాఖ ఏర్పాటు చేసిందన్నారు. దీనివల్ల ఏజెన్సీ ప్రాంతాలైన చింతపల్లి, సీలేరు, నర్సీపట్నం, కొయ్యూరు మైదాన ప్రాంతాలైన కోటవురట్ల, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అటువంటి దానిని ఇటీవల రిజర్వేషన్ నిలుపుదల చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . దూర ప్రాంతమైన ఎలమంచిలి, తుని రైల్వే స్టేషన్ కు వెళ్లడం జరుగుతుందని తక్షణము రైల్వే శాఖ స్పందించి రిజర్వేషన్ సేవలను అమలులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడుపూరు నందు రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. సాధారణంగా రక్తదాన శిబిరాలు డిగ్రీ కాలేజీల్లో, ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించడం జరుగుతుంది. కానీ మొట్టమొదటిసారిగా ఒక ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రశాంత్ పర్యవేక్షణలో విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులని రక్తదాతలుగా ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేస్తూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు 51 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగింది.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పరిశీలన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: మొల్లివానిపాలెంలో జరుగుతున్న డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణాలను 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి పరిశీలించారు. సుమారు 20లక్షల రూపాయల వ్యయంతో నెల్లిముక్కు ఎంపీపీ స్కూల్ నుండి మొల్లివానిపాలెం నడుపూరు హైస్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ ల పొడవు పెంచి ఆ రోడ్డుకు ఇరువైపులా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. క్వాలిటీ విషయంలో ఏమైనా లోటు పాట్లు ఉంటే మీకు బిల్లులు వచ్చే పరిస్థితి ఉండదని కాంట్రాక్టర్‌లకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, ములకలపల్లి పెంటయ్య, అండి బోయిన రాము నాయుడు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు షఫీ సంఘీభావం

విశాలాంధ్ర - పెందుర్తి: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా సంఘీభావం తెలిపారు. దీక్ష శిబిరం వద్దకు వెళ్లి పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న షఫీ కాంగ్రెస్ పార్టీ తరపు నుండి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని దారుణంగా మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న అన్ని విభాగాల వారు ఆందోళన బాట పట్టారంటే ప్రభుత్వం వారి పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. ఇకనైనా ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని షఫీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకు కార్మికులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గాజువాక లయన్స్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర - గాజువాక : ప్రగతి టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర వేడుకలు గాజువాక లయన్స్ క్లబ్‌లో అదివారం ఉత్సాహ వాతావరణంలో ఘనంగా జరిగాయి. అసోసియేషన్ కార్య వర్గ ప్రతినిధులు కేక్ కట్ చేసి సభ్యులకు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు జి.దామోదర్‌రావు, అప్పారి విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఏటా మా అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి మెకానిక్ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వంగపండు గణేష్, రెడ్డిపల్లి రాజు, వాలి బోయిన శ్రీనివాసరావు, పివిఎస్ఎన్ కుమార్, మెకానిక్‌లు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న పీవీ సురేష్

విశాలాంధ్ర - మల్కాపురం: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి పారిశ్రామిక వాడలో ప్రాణాలు విడిచిన ఓ అభాగ్యురాలికి పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ అన్నీ తానై ఆఖరి మజిలీ నిర్వహించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే ఆదివారం పారిశ్రామిక ప్రాంతం సింధియా కూడలి సమీపంలోని నేవల్ పార్కు వద్ద గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం పడిఉందన్న సమాచారంతో అక్కడకు చేరుకున్న పివి సురేష్ ట్రస్టు సభ్యుల సహకారంతో మహిళ మృతదేహాన్ని కోరమండల్ శ్మశానవాటికకు తరలించి మల్కాపురం పోలీసుల సమక్షంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శాంతిభద్రతల విభాగం ఎస్ఐ దేముడమ్మ, పలువురు ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ఎంప్లాయిస్ యూనియన్
వార్షిక డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పద్మశాలీ ప్రభుత్వ ఉద్యోగులంతా ఐక్యతగా ఉంటూ అన్ని రంగాల్లో ఉన్న కుల సభ్యులను ఆదుకునే విధంగా ప్రతి ఒక్క సభ్యుడు పనిచేయాలని పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మిత్తిపాటి మోహన్ మురళీ, కార్యదర్శి పివి సత్యనాంద్ అన్నారు. ఆదివారం నగరంలోని శంకర్మఠం జంక్షన్ వద్ద ఉన్న పద్మశాలీ భవన్లో పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ ఆధ్వర్యంలో 2024 వార్షిక డైరీ, క్యాలెండర్ను అతిథులు, యూనియన్ సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో పనిచేస్తున్న పద్మశాలీ ఉద్యోగులంతా ఈ యూనియన్లో చేరాలన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా ప్రణాళిక బద్ధంగా 'పనిచేయాలని, ఏ ఒక్క సభ్యునికి కష్టం వచ్చినా సంఘం తరుపున అండగా నిలవాలన్నారు. అదే విధంగా నూతనంగా నిర్మాణం చేయనున్న పద్మశాలి భవన్కు సంబంధించి కూడా తలో ఒక్క చేయి వేచి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు, యూనియన్ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల విశ్వేశ్వరరావు, ట్రెజరర్ భోశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎం. తిరుమల శ్రీదేవి, ములగాడ తహశీల్దార్ దొడ్డి వీరభద్రరావు, శ్రీ కనస్ట్రక్షన్ అధినేత శ్రీధర్. భవనం పెద్దలు కొలిపాక సన్యాసిరావు, తెడ్డుపు వెంకటేశ్వరరావు. ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ బిపిఎస్ కళ్యాణి. సోషల్ వెల్ఫేర్ ఎడి డి.సత్యనారాయణ, సీతంపేట సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుదేరాజు, ఎఎస్ఐఐ సూర్యప్రకాశరావు, మీనాక్షి, ఆరిలోవ నుంచి దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నాగోతి నాగమణి

విశాలాంధ్ర - ఆనందపురం: రాబోయే 2024 సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా భీమిలి నియోజకవర్గానికి చెందిన నాగోతి నాగమణి బరిలో నిలవనున్నారు. ఆదివారం పెద్దిపాలెం ప్యారడైజ్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడే పుట్టి ఈ ప్రాంతాలలోనే విద్యాభ్యాసం చేసి ఉద్యోగాలను చేపట్టిన తనకు ఈ ప్రాంతంలోని సమస్యలపైన సంపూర్ణ అవగాహన ఉందన్నారు. భీమిలి నియోజకవర్గం ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవసరమైన వసతులపైన, తగిన అవగాహనతో పాటు కొన్ని ప్రణాళికలు కూడా ఉన్నాయన్నారు. ప్రధానంగా ఆనందపురం మార్కెట్ కూడలి వద్ద నిరంతరం ట్రాఫిక్ సమస్య ఉందని భీమిలి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు, గ్రామాల్లో చేపట్టవలసిన పనులపైన తగిన కార్యాచరణ ప్రణాళికలు కూడా రూపొందిస్తున్నామన్నారు.

"అంతన్నాడు ... ఇంతన్నాడు.. నట్టేట్లో ముంచేసాడో కరణం ధర్మన్న

విశాలాంధ్ర - చోడవరం : ది చోడవరం సహకార చక్కెర కర్మాగారం (గోవాడ)లో పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లిస్తామంటూ హామీలు ఇచ్చిన ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ ప్రభుత్వ జి.ఓ. ఏమయ్యిందని చెరకు రైతులు, కార్మికుల బకాయిలు తక్షణమే చెల్లించాల్సిందిగా ఏ.పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఫ్యాక్టరీ గేటు వద్ద ఆదివారం చెరకు సభ్య రైతులుతో కలిసి ఆ మీడియాతో మాట్లాడారు. కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.12 కోట్లు చెల్లించేందుకు ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలు నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ లు గత నెలలో జరిపిన ఫ్యాక్టరీ మహాజన సభలో పోటీలు పడి మరీ వాగ్దానాలు చేసేసారని, ఇది జరిగి నెల రోజులు దాటుతున్నప్పటికి నేతలు ముఖం చాటేస్తుండటంతో చెరకు రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఆందోళనలో పడ్డారు. "అంతన్నాడు.., ఇంతన్నాడు.., నమ్మించి నట్టేట్లో ముంచేసాడో .. అంటూ జిల్లా వై.సి.పి. నేతల తీరు" ను రైతాంగం దుయ్యబడుతున్నారు. వాతావరణం ప్రతికూల, ప్రకృతి వైపరీత్యం కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో పంటలు దెబ్బ తిని, రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే గోవాడ సుగర్స్ లో కార్మిక,కర్షకులకు బకాయిలు చెల్లించాలని, రైతును రాజు చేసేందుకు అధికార ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ఊక దంపుడు ఉపన్యాసం ఇచ్చిన మంత్రి, ప్రభుత్వ విప్ లు కనపడరేమి అని ప్రశ్నించారు. నిండా అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగానికి, మహాజన సభలో వై.కా.పా.నేతలు పలికిన మాటలు చేతల్లో కానరాక, రైతుల్ని ఇబ్బంది పెడుతున్న వైసిపి ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సత్వరమే బకాయిలను చెల్లించకపోతే రైతులతో కలిసి కమ్యునిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలకు దిగుతామని, హెచ్చరించారు.

విద్యార్థులను మోసం చేసిన జగన్ రెడ్డి

బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉద్యోగులను, ఉపాధ్యాయులను, అంగన్వాడీలను, సమగ్ర శిక్షణ అభియాన్ ఉద్యోగులను ,నిరుద్యోగులను ,రైతులను, కార్మికులను, కాంట్రాక్ట్ కార్మికులను, పారిశుద్ధ్య కార్మికులను, మోసం చేసినట్లే విద్యార్థులను కూడా విద్య దీవెన పథకంలో మూడు వాయిదాలు సొమ్ము 3500 కోట్లు జగన్ దారి మళ్లించారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వం పై ఘాటుగా విమర్శలు చేశారు. ఈరోజు ఉదయం పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఇచ్చిన ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని పేరు మార్చి విద్య దీవెన పేరుతో వైసీపీ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి అమలు చేస్తున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం హయా%శీ%లో ఫీజు రియంబర్స్మెంట్ ను డైరెక్ట్ గా కళాశాలకు విద్యార్థుల తరఫున జమ చేసే వారిని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థి తల్లుల ఖాతాకు జమ చేస్తున్నారని, బ్యాంకు నుండి డ్రా చేసి మరల కళాశాలలకు చెల్లిస్తున్నారని, కొంతమంది తల్లులు కళాశాలలకు చెల్లించకుండా స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారని, కళాశాల యజమాన్యాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వారు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, ఫీజు రీఎంబర్స్మెంట్ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ డబ్బు విడుదల చేస్తామని, చెప్పిన ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాల కాలంలో నాలుగు వాయిదాలు ప్రభుత్వం ఎగ్గొట్టిందని నాగ జగదీష్ అన్నారు. ప్రభుత్వం ఎగ్గొట్టిన సొమ్ము ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పడం లేదని, విద్యా సంవత్సరం ముగిస్తున్న ఫీజు మొత్తం చెల్లించకపోతే కళాశాలలు ఊరుకోవని, ప్రభుత్వం ఎగ్గొట్టిన సొమ్ము విద్యార్థుల కుటుంబాల తమ జేబులో నుంచి కళాశాలకు చెల్లించవలసి ఉంటుందని, డబ్బు చెల్లించకపోతే సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, గతంలో అనేకసార్లు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని, సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఉన్నత చదువులకు కోసం సర్టిఫికెట్లు తప్పనిసరి అని, అటువంటి పరిస్థితుల్లో తమ సర్టిఫికెట్ల కోసం అప్పులు చేసి కళాశాలలకు చెల్లిస్తున్నామని విద్యార్థులు వాపోతున్నారని నాగ జగదీష్ ప్రభుత్వంపై మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అమలు చేసిందని, వైసీపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని, 2019- 2020 సంవత్సరాలకు పీజీ విద్యార్థులకు చెల్లించవలసిన 450 కోట్లు ఎంతవరకు చెల్లించలేదని, విద్యా జీవన బకాయిలు దీనికి అదనమని నాగ జగదీష్ అన్నారు. జగన్ ప్రభుత్వం విద్యా దీవెన పథకంలో విద్యార్థుల సంఖ్యను బాగా తగ్గించి వేసిందని, జగన్ సొంత పత్రికల్లో వచ్చిన ప్రకటనలను, వాస్తవంగా విద్యార్థులకు ఇస్తున్న సంఖ్యకు 3 లక్షలు ఎలా తగ్గిందని ప్రభుత్వాన్ని నాగ జగదీష్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి విద్యా దీవెన, వసతి దీవెన, పథకాలలో విద్యార్థులకు మూడు పెళ్లిళ్ల గురించి పదే పదే విద్యార్థులకు బోధిస్తున్నారని, ఒక ముఖ్యమంత్రి విద్యార్థుల భవిష్యత్తు కావలసిన విషయాలు చెప్పవలసిన ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలను విమర్శలు చేయడానికి ప్రభుత్వ సభలను వాడుకోవడం దుర్మార్గమని ఎన్నికలు సమీపిస్తున్న వేళ తీవ్ర ఒత్తిడితో ఏం మాట్లాడుతున్నారో తెలియలేని పరిస్థితిలో జగన్ రెడ్డి ఉన్నారని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు.

విలేకరుల సమావేశంలో పిట్ల హరీష్, అనకాపల్లి పట్టణ అధ్యక్షులు, వరదా మోహన్ కాంత్, ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి సాయికృష్ణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

రామానాయుడు పాదయాత్ర విజయవంతం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాడుగుల నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా పూర్తయింది. ఆదివారం మాడుగులలో ముగింపు సభ ఏర్పాటు చేశారు. ముందుగా మాడుగుల బస్టాండ్లో ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామానాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికా రంలోకి రావడం ఖాయం అన్నారు. మాడుగుల నియోజక వర్గంలో టిడిపి జెండా రెపరెప లాడించడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పకుంటే ఆంధ్రప్రదేశ్ రాక్షస రాజ్యంగా మారిపోతుందన్నారు. మండలంలో ఐదు రోజులుగా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ విజయవంతంగా జరిగిందని, పలువురు వైసిపి కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారన్నారు. సైకో జగన్ను ముఖ్యమంత్రిని చేసి నానా ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలు, ఎన్నికల కోసం చూస్తున్నారని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఆరాటపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజవర్గం నుండి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు హాజరయ్యారు.

రామానాయుడు పాదయాత్రకు విశేష స్పందన

మాడుగుల నియోజకవర్గంలో రామానాయుడు చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభించింది. ప్రతి గ్రామంలో రామానాయుడుకు మహిళలు హారతులు పట్టారు. అడుగడుగునా నిరాజనం పలికి తమ గ్రామాలకు స్వాగతం పలికారు. ప్రజల ఆదరణ చూస్తుంటే ఈ సారి ఎమ్మెల్యే టికెట్ వచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. నియోజకవర్గంలో రామానాయుడుకు తిరుగు లేదని టిడిపి వర్గాలు అంటున్నాయి.

యువ పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు జేకాం ఒక దిక్సూచి

విశాలాంధ్ర - సాగర్‌నగర్: ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలకు జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (జెకాం) ఒక దిక్సూచి అని జేకాం విశాఖపట్నం 2.0 గ్రూప్ కోచ్ ఎస్ రాజశేఖర్ అన్నారు. సంస్థ వార్షిక సంబరాలు శుక్రవారం సాగర్ నగర్ ఆరిఫ్ సీ రిసార్ట్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా టేబుల్ కోచ్ రాజశేఖర్ మాట్లాడుతూ జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ సంస్థకు అనుబంధంగా జెసీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. మారుతున్న ప్రపంచ వాణిజ్యరంగానికి అనుగుణంగా యంగ్ బిజినెస్ లీడర్స్‌ను శక్తివంతంచేసి వ్యాపార అవకాశాలను అభివృద్ధి చేయడం జెకాం మిషన్ లో భాగమని ఆయన పేర్కొన్నారు. టేబుల్ చైర్మన్ బి. చైతన్య రాజీవ్ సంస్థ వార్షిక నివేదిక ను సమర్పించారు. ఈ ఏడాది జీ నోట్ ద్వారా 5 కోట్ల రూపాయులు లావాదేవీలు జరగాలన్నది లక్ష్యం కాగా దాన్ని అధిగమించి రూ. 6,61,59,481 సభ్యుల మధ్య వ్యాపార లావాదేవీలు జరిగాయని చైర్మన్ చైతన్య రాజీవ్ పేర్కొన్నారు. కోచ్ రాజశేఖర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సభ్యులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. 2024 నూతన కార్యవర్గ వివరాలను కోచ్ రాజశేఖర్ ప్రకటించారు.

నూతన చైర్మన్ గా పి అశోక్ కుమార్, వైస్ చైర్మన్ గా డి. శివ గుప్తా, సెక్రటరీగా కె. ఎం. కె. రమేష్, ట్రెజరర్ గా వి. శ్రీ రంగా, డైరెక్టర్స్ గా ఎస్.నవ్య, కె. ఋషి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎం. హేమంత్, సూర్య తేజ, కె.లక్ష్మణ రావు, కె. సురేష్, వి. ప్రవీణ్, కె. మారుతీ, పి. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ అభిషేక్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ ను రెవెన్యూ అధికారులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నూతన సబ్ కలెక్టర్‌గా వి. ధాత్రి రెడ్డి మూడు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు ఇన్చార్జి సబ్ కలెక్టర్, ఐ.టి.డి. ఏ పి ఓ గా విధులు నిర్వహించారు. బుధవారం సబ్ కలెక్టర్గా విధుల నుండి రిలీవ్ అయ్యారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సబ్ కలెక్టర్ గా ఆయన చేసిన సేవలను ఏలువురు తహాశీల్దారులు కొనియాడారు. ఈ సందర్భంగా ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అందిరి సహకారంతో సబ్కలెక్టర్గా సంతృప్తికరమైన సేవలందిం చానని చెప్పారు. పాడేరు సబ్ కలెక్టర్గా పని చేయడం అదృ ష్టంగా భావిస్తున్నానన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాడేరుకు బైపాస్ రోడ్డు నిర్మాణా నికి కృషి చేసానన్నారు. అదే విధంగా ఏజెన్సీలో కమ్యూ నికేషన్ వ్యవస్థ మెరుగు పరచడానికి సెల్ టవర్ల నిర్మాణా లకు అవసరమైన భూ సేకరణ చేసానన్నారు. ఏడు డి ఎల్ సిలు నిర్వహించి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లబ్దిదారులకు 50 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందరి సహకారంతో విజయవంతంగా విధులు నిర్వహించానని సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి 11 మండలాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని, రాబోవు ఏడాది (2024) ప్రతి ఒక్కరికి మంచి జరగాలని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నూతనంగా వస్తున్న 2024 సంవత్సరం రాష్ట్ర ప్రజల బ్రతుకుల్లో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని, గడచిన ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వంలో ఇబ్బంది పడిన ప్రజలందరికీ ఈ ఏడాదిలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో తెదేపా విజయం సాధించి రాష్ట్ర ప్రజలందరికీ విముక్తి లభించ బోతుందన్నారు. సైకో ప్రభుత్వం పోవడం, సైకిల్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు.

నిరుపేద మహిళలకు చీరల వితరణ

విశాలాంధ్ర - చింతపల్లి: క్రిస్మస్, నూతన సంవత్సర పండగలను పురస్కరించుకొని గ్రామంలోని నిరుపేద మహిళలకు తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద రావు, వరహాలమ్మ దంపతులు చీరలు వితరణగా అందించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని నిరుపేద మహిళలు కూడా రాబోవు నూతన సంవత్సర వేడుకలలో ఆనందంగా గడపాలనే సదుద్దేశంతో తమకు తోచిన రీతిలో నిరుపేద గిరి మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకురాలు బేతా నూక రత్నం పాల్గొన్నారు.

కాంగ్రెసులో చేరనున్న వేగి దివాకర్

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రముఖ రాజకీయ నాయకుడు వేగి దివాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో సోమవారం దివాకర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా తెలియజేశారు. 2014 నుండి 2019 వరకు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన వేగి దివాకర్ పెందుర్తి ప్రాంతంలో పలుకు బడి గల రాజకీయవేత్త. ఆయన చేరికతో పెందుర్తిలో కాంగ్రెస్ పార్టీ బలం పెరుగుతుందని షఫీ తెలిపారు. దివాకర్ ను కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా లక్ష్మి గణపతి హెూమం

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో చరిత్ర ప్రసిద్ధి పొందిన చోడవరం స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవాలయములో ఆదివారం భక్తుల చే సామూహికంగా శ్రీ లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. మార్గశిర బహుళ చవితి సంకష్టహర చతుర్థి సందర్భముగా వేకువ జామునే స్వామికి పంచామృతాలతో అభిషేకించి, విభూది చందనంతో అలంకరించి ఉదయం 9 గంటలకు పురుష సూక్త పూర్వకముగా లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్) తెలిపారు. చోడవరం తో బాటు వివిధ పట్టణాల నుండి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఈ.ఒ. ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి తెలిపారు.

ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: రాబోవు నూతన సంవత్సర (2024) వేడుకలను అందరూ ఆనందోత్సాహాల మధ్య సుహృద్భావ వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 2024 ఏడాది ప్రతి ఒక్కరికి మంచి జరగాలని, ఈ ఏడాదిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజల కోసం పనిచేసే జగనన్న ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలని ఆమె ఆకాంక్షించారు.

మాంసం విక్రయాలు జరపొద్దు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం గ్రామంలో ఇటీవల డయరియా ప్రబలడంతో గ్రామంలో చేపలు మాంసం విక్రయాలు చేయరాదని వాటిని ఎవరు తినరాదని పంచాయతీ సెక్రటరీ వీర్రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డయేరియా అదుపునకు బ్లీచింగ్ చల్లించామన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి నీటిని త్రాగాలన్నారు. ఎటువంటి అనారోగ్యం ఏర్పడినా అశ్రద్ధ చేయకుండా తగిన చికిత్స తీసుకోవాలని కోరారు.

అమరావతి సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆనందపురం: అమరావతి సికే కన్వెన్షన్ హాల్లో జనవరి 3వ తేదీన జరగబోయే రాష్ట్ర సర్పంచుల సంఘం చాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల సమస్యల కోసం సమావేశం జరగనుందని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని అందువల్ల విశాఖ జిల్లా సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు తెలిపారు.

సీపీఎస్‌పై స్పష్టమైన హామీ ఇవ్వాలి



విశాలాంధ్ర - నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ వద్ద ప్రెస్ మీట్ పాయింట్ వద్ద వైఎస్ఆర్సిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి ని, శాసనసభ్యులు ఉమాశంకర్ గణేష్‌ను పార్లమెంటరీ సభ్యురాలు బి సత్యవతి, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లను ఏపీసీపీఎస్సీ జిల్లా అధ్యక్షులు గాడి సూర్య ప్రకాష్ కలిశారు. ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానము అమల్లోకి తేవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ జిపిఎస్ విధానాన్ని అంగీకరించబోమని తెలియజేసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జి సుబ్బారావు, మాకవరపాలెం మండల అధ్యక్షులు లక్ష్మి రాజ్, లగుడు అప్పలనాయుడు, శరభయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఔధార్యం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో సీతంపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు ముత్యాలచిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇల్లు అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ ఎలక్ట్రికల్ వస్తువులు కూడా అగ్నికి ఆహుతి కావడంతో ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురైన ముత్యాల వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి ఆయుర్వేద ప్రముఖ వైద్యులు జమాల్ ఖాన్ ఇటీవల సందర్శించి బాధిత కుటుంబాన్ని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని అభయమిచ్చి అనంతరం ఆదివారం వారికి అవసరమైన సిమెంట్ రేకులు ఇనుప పైపులను 32 వేల రూపాయల విలువైన ఇంటి సామాగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఇన్చార్జ్ సుభాని, విఆర్ పురం గ్రామ పెద్దలు సర్పరాజ్, సీతంపేట గ్రామ పెద్దలు బొర్రా రాంబాబు, పొత్తుల నారాయణ, ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ న్యూ ఇయర్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: 2024 నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో హాయిగా జీవించాలని.. ఆనందంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున ఆకాంక్షించారు. అంతా మంచి జరగాలని.. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకోవాలని.. మరెన్నో విజయాలను అందుకోవాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరంలో అటు రాష్ట్రం నుంచి ఇటు జిల్లా యంత్రాంగం నుంచి జిల్లా ప్రజలకు ఎన్నో రకాల ఉత్తమ సేవలు అందాయని.. ఈ కొత్త ఏడాదిలో అంతకు మించి ఉత్తమమైన సేవలు అందుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగంలోని ఉద్యోగులు, సామాన్య ప్రజలు వారి లక్ష్యాలు సాధించేందుకు.. మరెన్నో మైలు రాళ్ళు దాటేందుకు 2024 సంవత్సరం సరికొత్త వేదిక కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివాసీ అభివృద్ధికి పోరాడుదాం

విశాలాంధ్ర - వై.రామవరం: ఆదివాసీల హక్కులు, చట్టాల కొరకు కలిసి కట్టుగా పోరాడుదాం అని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జెడ్పి స్కూల్‌లో ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం 2వ ఆవిర్భావ దినోత్సవం సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వెదుల్ల లచిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు చెందిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తున్నారు అని విమర్శించారు. అలాగే ఎమ్మెల్యే లు,ప్రజా ప్రతనిధులంతా గిరిజనుల అభివృద్ధి కోసం ఏ విధంగాను పనిచేయడం లేదని అన్నారు. ఆదివాసీలో ఏడు తెగల గిరిజనుల్లో చైతన్యం లేక అభివృద్ధి సాధించుకోలేకపోతున్నామని అన్నారు. కో కన్వీనర్ గుద్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఆదివాసీ సంఘాల నుండే ఒకరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టుకుందామని అందుకు 22 మండలాల నుండి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మదిగొంత వెంకటేశ్వరరావు, జిల్లా కో కన్వీనర్ గుద్ల త్రిమూర్తులు, జాయింట్ సెక్రటరీ వంతు బాలకృష్ణ, కోశాధికారి వల్లాల లింగారెడ్డి, మండల అధ్యక్షులు ముర్ల సూరిబాబు, గ్రామ అధ్యక్షులు పుడిగి లక్ష్మణరావు, సర్పంచ్ పల్లాల బాలు రెడ్డి, ఆదివాసీలు పాల్గొన్నారు.

అబిద్ సెంటర్‌లో వైసీపీ సాధికార యాత్రకు అనుమతి ఎలా ఇచ్చారు

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం అబిద్ సెంటర్లో వైఎస్ఆర్ పార్టీ నిర్వహించిన బస్సుయాత్ర సమావేశంను బిఎస్పి నర్సీపట్నం నియోజకవర్గ అభ్యర్థి బొట్టా నాగరాజు వ్యతిరేకించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నంలో ఇప్పుడు వరకు ఇలాంటి సమావేశాలు జరగలేదని, ప్రజలను రెండు రోజుల నుండి ఇబ్బందులకు గురి చేసినటువంటి దుర్మార్గపు చర్య అని, మరొక పార్టీ కూడ ఇటువంటి సమావేశాలు చేపట్టకూడదని విజ్ఞప్తి చేశారు. నర్సీపట్నంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో అబిద్ సెంటర్ ఒకటని, ఈ పండగ సీజన్లో కూడా ఈ సెంటర్లో పర్మిషన్ ఇచ్చినటువంటి అధికారుల పైన చర్యలు తీసుకోవాలని బి.ఎస్.పి పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఎందుకంటే ఒక రాజకీయ పార్టీ మీటింగ్ కోసం ఏకంగా రెండు రోజులు నర్సీపట్నం మొత్తాన్ని స్తంభింపచేయడం సబబు కాదని, ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ నాయకులకు తలవొగ్గి ఇలాంటి పర్మిషన్లు ఇవ్వడం చాలా దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని అన్నారు. ఎందుకంటే వృద్ధులు, స్కూల్ కెళ్లే పిల్లలు చాలామంది పల్లెటూరి నుండి వచ్చినటువంటి బస్సులు ఎక్కడ ఆగుతాయో, ఎక్కడ ఎక్కాలో తెలియక చాలామంది ఇబ్బందులు గురయ్యారు కాబట్టి, ఇలాంటి చర్యలు మరొక్కసారి పునరావృతం కాకుండా ఉండాలంటే,వేరే ఒక పార్టీ మళ్ళీ ఇలాంటి మీటింగ్ ఇక్కడ పెట్టాలనే ప్రయత్నం చేయకుండా ఉండాలంటే,ఈ మీటింగ్కు పర్మిషన్ ఇచ్చిన అధికారుల పైన కలెక్టర్, జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని బిఎస్పి పార్టీగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ కన్వీనర్ కొల్లు గంగాధర్, యూత్ నాయకులు ఆనంద్, సిహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.